

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 37.0
కనిష్టం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (శని)
సహర్ : 4:48 (ఆది)

ఇక సమరమే

నేడే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



నిబంధనలు మీరితే..

- షెడ్యూలు విడుదలైన వెంటనే అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- పార్టీలు, అభ్యర్థుల ప్రచారంపై నిరంతర నిఘా.. అతిక్రమిస్తే చర్యలు

ఏలూరు, మార్చి 15 : సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది. రాజకీయ పార్టీలు నియమావళిని కచ్చితంగా పాటించాలి. పాటించకపోతే చర్యలకు బాధ్యులవుతారు.

నియమావళి ప్రకారం..

- అధికార పార్టీ ప్రభుత్వపరంగా సాధించిన విజయాలను ప్రభుత్వ ఖర్చుతో ప్రకటనలు చేయకూడదు.
- అధికారిక పనులను ఎన్నికల ప్రచారంతో కలపకూడదు.
- ఓటరును ఆర్థికంగా లేదా ఇతర ప్రలోభాలకు గురిచేయరాదు.
- ఓటర్ల కుల/మత భావాలను ప్రేరేపించరాదు, కించపరచరాదు.
- విభిన్న కులాలు, వర్గాలు, మత, భాషా సమూహాల మధ్య ఉన్న విభేదాలను తీవ్రతరం చేయరాదు. పరస్పర ద్వేషాన్ని సృష్టించి ఉద్రిక్తతకు కారణమయ్యే కార్యకలాపాలను చేయరాదు.
- ధ్రువీకరించబడని ఆరోపణలు లేదా ఆధారం లేని వాటిపై ఇతర పార్టీలు లేదా వాటి కార్యకర్తలను విమర్శించరాదు.
- దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు లేదా ఏదైనా ప్రార్థనా స్థలాలను ఎన్నికలకు సంబంధించిన ప్రసంగాలు, పోస్టర్లు, సంగీతం మొదలైన వాటితో సహా ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించరాదు.
- అవినీతి పద్ధతులు లేదా లంచం, ఓటర్లను బెదిరించడం, వ్యక్తిత్వాన్ని దూషించడం, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన గంటతో ముగిసే 48 గంటల వ్యవధిలో బహిరంగ సభలు, పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తీసుకువెళ్ళడం నిషేధం.
- వ్యక్తులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ వారి ఇళ్ల ముందు ప్రదర్శనలు, పికెటింగ్ వంటివి చేయరాదు.
- స్థానిక చట్టాలకు లోబడి ఏ వ్యక్తి భూమి, భవనం, ప్రహరీ గోడలపై రాతలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదు. వాహనాలపై జెండా స్తంభాలు ఉంచకూడదు.
- పార్టీలు లేదా అభ్యర్థులు ఇతర రాజకీయ పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు లేదా ఊరేగింపులలో అలజడులు సృష్టించకూడదు.
- వేరొక పార్టీ సమావేశాలు నిర్వహించే ప్రదేశాలలో ఊరేగింపులు చేపట్టరాదు.
- ఆయుధాలు, క్షిపణులుగా ఉపయోగించుటకు అవకాశంవున్న వస్తువులను ఊరేగింపుదారులు తీసుకెళ్లరాదు.
- ఇతర పార్టీలు, అభ్యర్థులు జారీచేసిన పోస్టర్లను తొలగించరాదు.
- పోలింగ్ రోజున గుర్తింపు స్లిప్పుల పంపిణీ ప్రదేశం లేదా పోలింగ్ బూత్‌ల సమీపంలో పోస్టర్లు, జెండాలు, చిహ్నాలు లేదా మరే ఇతర ప్రచార సామగ్రిని ప్రదర్శించరాదు.
- కదిలే వాహనాలపై స్థిరంగా లేదా అమర్చిన లౌడ్ స్పీకర్లను ఉదయం ఆరు గంటలకంటే ముందు లేదా రాత్రి 10 గంటల తర్వాత సంబంధిత అధికారుల ముందస్తు లిఖిత పూర్వక అనుమతి లేకుండా ఉపయోగించరాదు.
- బహిరంగ సభలు మరియు ఊరేగింపులలో సంబంధిత అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదు. పండుగలు, పరీక్షలు మొదలైనవి పరిగణనలోకి తీసుకొని సాధారణంగా ఇలాంటి ఉంటుంది. సభలు, ఊరేగింపులకు రాత్రి 10 గంటల తర్వాత అనుమతి ఉండదు.
- ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేయరాదు.
- భద్రతా ముప్పు ఉందని అంచనా వేయబడి అధికారిక భద్రత కల్పించబడిన ఏ వ్యక్తి అయినా పోలింగ్ రోజున తన భద్రతా సిబ్బందితో మాత్రమే పోలింగ్ స్టేషన్ ఆవరణ పరిసరాల్లోకి ప్రవేశించాలి. సదరు వ్యక్తి తన భద్రతా సిబ్బందితో పోలింగ్ రోజున నియోజకవర్గంలో సంచరించకూడదు. ఆ వ్యక్తి ఒక ఓటరు అయితే, అప్పుడు అతడు, ఆమె వారి భద్రతా సిబ్బందితో కలిసి వారి కదలికలను ఓటు వేయడానికి మాత్రమే పరిమితం చేయాలి.
- భద్రతా ముప్పు ఉందని అంచనా వేయబడి అధికారిక భద్రత కల్పించబడిన వ్యక్తిని లేదా తన భద్రత కోసం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను కలిగి ఉన్న వ్యక్తిని ఎన్నికల ఏజెంట్‌గా లేదా పోలింగ్ ఏజెంట్‌గా లేదా కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించకూడదు.

క్లైమాక్స్‌లో జాబితాలు

- అసంతృప్త నేతలతో బాబు మంతనాలు
- అన్నీ తాను చూసుకుంటానని భరోసా
- కమలంలో లోక్‌సభ టికెట్ లొల్లి
- వైసీపీలో అనుమానాల వేడి
- జనసేనలో అక్కడక్కడా జగడాలు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు వీలుగా నేడు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ మరుక్షణమే కోడ్ అమల్లోకి వస్తుంది. ఇప్పటికే గెలుపు గుర్రాలను బరిలోకి దింపేందుకు వీలుగా జాబితాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. గెలుపే లక్ష్యంగా పొత్తుతో మూడు పార్టీలు ముందడుగు వేశాయి. ఎంపీ స్థానం కోసం బీజేపీలో నిరసన గళం వినిపించింది. టీడీపీ సీనియర్లకు సీటు రాకున్నా అన్నీ నేనే చూసుకుంటా.. భయం లేదంటూ బాబు భరోసా. వైసీపీలో అనుమానాల లొల్లి. నియోజకవర్గాల్లో ప్రధాన పక్షాల ముఖ్య నేతల భేటీలు. అన్ని పార్టీల్లోనూ గోడదూకుళ్లు.. ఇవీ నేటి తాజా రాజకీయ సంగతులు..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పొత్తుపర్వంలో అందరినీ సంతృప్తిపరిచేందుకు అధినాయకత్వాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమలో సీటు రాక డీలా పడిన కన్వీనర్లు, మాజీ మంత్రులను పిలిపించి, వారందరినీ బుజ్జగించి మీ భవిష్యత్‌కు నాదీ గ్యారంటీ అంటూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు శుక్రవారం భరోసా ఇచ్చారు. ఇప్పటికే పొత్తులో జనసేనకు ఆయా స్థానాలు కేటాయించడం తెలుగు తమ్ముళ్లు కాస్తంత నిరసన స్వరంతో రోడ్డెక్కిన దరిమిలా అధినేతే రంగంలోకి వచ్చి బుజ్జగిస్తున్నారు. పోలవరం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించగా, ఇక్కడ ఇన్నాళ్లు పార్టీ కన్వీనర్‌గా వున్న బొరగం శ్రీనివాసరావును చంద్రబాబు బుజ్జగించారు. ఏం పర్వాలేదు.. అన్నీ నేను చూసుకుంటానంటూ ధైర్యం చెప్పారు. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును, కొవ్వూరులో మాజీ మంత్రి కేఎస్ జవహర్‌ను, పిలిచి మరీ శాంతింపజేశారు. వీరిద్దరికి తగిన హామీ ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినందున ఆ స్థానాల్లో గెలుపు బాధ్యతలు మీరే తీసుకోవాలంటూ కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన రీతిలో గౌరవిస్తా, పదవులు ఇస్తా అంటూ ప్రత్యేకహామీ ఇచ్చారు. వీరితోపాటు తాడేపల్లిగూడెం నుంచి వలవల బాబ్జీకి ఈ తరహా హామీ లభించింది. వాస్తవానికి ఇన్నాళ్లు కాస్తంత ఆగ్రహంతో వున్న వీరంతా పూర్తిగా అధినేత మాటలతో ఏకీభవిస్తూ పార్టీ ఆదేశం శిరోధార్యమని బాబుకు స్పష్టం చేశారు. ఇంకోవైపు కనీసం పార్టీలో ఇన్నాళ్లు కొనసాగిన తగిన మర్యాద ఇవ్వడంలేదని, తమ భవిష్యత్ గురించిగానీ, ప్రస్తుత ఎన్నికల గురించిగానీ పార్టీ ఏనాడూ తమను సంప్రదించడం లేదని ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడింది ఇందుకా అంటూ మాజీ మంత్రి పీతల సుజాత తో సహా ఇంకొందరు నిరసన గళం విప్పుతున్నారు. ఇప్పటికే పూర్తిగా అసంతృప్తిని ప్రకటించిన మాజీ ఎమ్మెల్యేలు శివరామరాజు, బండారు మాధవనాయుడు తమ భవిష్యత్‌పై నేడు కీలక ప్రకటన చేయాలని నిర్ణయించుకున్నారు. మిగతా నేతల మాదిరిగానే వీరిని కూడా తెలుగుదేశం అధినాయకత్వం పిలిచి సమన్వయపరిస్తే ఈ సమస్య రాదని పార్టీ కేడర్ సైతం వాపోతున్నారు. ఒక్క ఉంగుటూరు నియోజకవర్గంలోనే మాజీ ఎమ్మెల్యే టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నేరుగా పార్టీ ఆదేశాలను మన్నించి క్రమశిక్షణతో వ్యవహరించగలిగారు. ఇప్పుడు తాజాగా కొందరితో అధినేత చంద్రబాబు మాట్లాడి అనునయించినట్లుగానే మిగతా వారి విషయంలోనూ చొరవ చూపాల్సి వుంది. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఈ తరహా చిన్న చిన్న సమస్యలను నేడో రేపో ప్యాచ్ వర్క్ చేస్తారని భావిస్తున్నారు.

జనసేనలో మరో సీన్

జనసేనలో నాయకత్వం ఎక్కడికక్కడ నేతలను సమన్వయ పరచడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఒక్క పోలవరం మినహా మిగతా ఐదు స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించారు. తాజాగా ఈ స్థానం నుంచి ఒకరిద్దరి పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. దీన్ని స్థానిక నాయకత్వం తప్పుబడుతూ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. దీనికి టీడీపీ నేతలు హాజరయ్యారు. ఇంతకుముందు పోటీ చేసిన జనసేన అభ్యర్థికే తిరిగి అవకాశం ఇవ్వాలనేది సమావేశ సారాంశం. ఏలూరులో నేతలను సర్దుబాటు చేసిన విధంగానే పోలవరంలోనూ ఈ రకంగానే చర్యలకు దిగవచ్చని భావిస్తున్నారు. ఈ స్థానానికి అభ్యర్థిని శనివారం ప్రకటిస్తారని ఆశతో ఉన్నారు. నరసాపురం నియోజకవర్గంలో ఆ పార్టీ సీనియర్ నేత కొత్తపల్లి సుబ్బారాయుడు హల్‌చల్ చేస్తున్నారు. ఇప్పటికే జనసేన అభ్యర్థిగా నాయకర్‌ను ప్రకటించినప్పటికీ, తన భవిష్యత్ కార్యక్రమం వేరే వుందని, తన సత్తా ప్రదర్శించడానికి శనివారం ముహూర్తంగా ఎంచుకున్నారు.



ఏలూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న తపన చౌదరి

సీటు కావాలంటూ తపించారు..

బీజేపీలో ఏలూరు లోక్‌సభ స్థానం విషయంలో రగడ సాగుతూనే ఉంది. ఈ స్థానాన్ని బీజేపీకి కేటాయించాలని స్థానిక నాయకత్వం పట్టుబడుతోంది. ఈ స్థానం పరిధిలో నిరవధికంగా శ్రమపడిన తపన చౌదరి వంటి వారిని ప్రోత్సహించాలే తప్ప ఎందుకు పక్కన బెడుతున్నారంటూ శుక్రవారం ఏలూరులో జరిగిన ఆత్మీయ సదస్సులో కొందరు ప్రశ్నించారు. బాగా పనిచేసినందుకే ఏలూరు సీటును పార్టీ కోరుకోలేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. వేలాది మంది తరలివచ్చిన ఈ ఆత్మీయ సదస్సులో ఏలూరు ఆశావహుడు తపన చౌదరి ముక్కుసూటిగా మాట్లాడారు. కొంచెం ఆలస్యమైనా ఏలూరు నుంచి పోటీ చేసేది తానేనని, గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి నిర్విరామంగా శ్రమించడమే కాకుండా, నియోజకవర్గంలో ప్రజలకు సేవలందించడంలో ఏ నాడూ వెనుకడుగు వేయలేదన్నారు. రాష్ట్రంలో మూడు పార్టీల మధ్య పొత్తు కుదిరిన తర్వాత బీజేపీ పక్షాన ఈ తరహాలో ఆత్మీయ సమావేశాలు గానీ, ఫలానా సీటు కావలసిందేనని పట్టుబట్టడానికి ఏలూరే వేదికయింది.

ఎంపీ స్థానాల్లో ఇంకా అంతే ?

ఓ వైపు ఏలూరు లోక్‌సభ స్థానం తమకే కేటాయించాలని బీజేపీ పట్టుబడుతున్న టీడీపీ మాత్రం ఏలూరు స్థానానికి అభ్యర్థుల కసరత్తులో మునిగి తేలుతోంది. ఈ స్థానం నుంచి కంభంపాటి రామ్మోహన్, గోరుముచ్చు గోపాల్‌యాదవ్, పోలీసు అధికారి సత్యనారాయణ గౌడ్‌తోపాటు తాజాగా మహేష్ యాదవ్‌పేరు తెరముందుకు వచ్చినట్లు ప్రచారం సాగింది. మాజీ ఆర్థిక మంత్రి సీనియర్ నేత యనమల రామకృష్ణుడి అల్లుడైన మహేష్ యాదవ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆది నుంచి ఆసక్తితో ఉన్నారు. ఏలూరు నుంచి ఇప్పటికే వైసీపీ బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపినందున టీడీపీ పక్షాన గోపాల్‌యాదవ్‌ను బరిలోకి దింపుతారనుకున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ సహితం గోపాల్ యాదవ్‌వైపు మొగ్గు చూపారు. ఈలోపే బీజేపీ పొత్తులో భాగస్వామ్యం కావడంతో ఎంపీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికలో జాప్యం జరిగింది. భాష్యం రామకృష్ణతోపాటు అనేకపేర్లు తెరమీదకు వచ్చాయి. ఈ కోణం లోనే మహేష్‌యాదవ్ పేరు శుక్రవారం ప్రచారంలోకి వచ్చింది. ఓ వైపు మిత్రపక్షం బీజేపీ, జనసేనతో కలిసి ప్రయాణించాల్సి వున్నందున ఎంపీ స్థానాల అభ్యర్థుల జాబితా విడుదలలో జాప్యం చోటు చేసుకుంది. నరసాపురం నుంచి సిటింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు కచ్చితంగా పోటీ చేసి తీరతారని ఆయన అభిమానులు ఇప్పటికీ ధీమాగా వున్నారు. ఎంపీల జాబితా విడుదల చిలకలూరిపేట బహిరంగ సభకు ముందా ఆ తర్వాతా అనేది స్పష్టత రాలేదు.

వైసీపీలో ఇంకో లొల్లి

వైసీపీ అభ్యర్థుల జాబితాలో చివరి క్షణం వరకు లొల్లి కొనసాగుతూనే వచ్చింది. తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి నానిని ఆఘమేఘాల మీద పార్టీలో చేర్చుకున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా కండువా కప్పి ఆహ్వానించారు. అయితే దేవాదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ సీన్‌లో లేకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. కావాలనే ఇదంతా జరిగిందా అనే అనుమానాలు అంతటా వ్యాపించాయి. వైసీపీ పెద్దలు మాత్రం అటువంటిదేం లేదని శనివారం విడుదల చేసే జాబితాలో కొట్టు పేరు మాత్రమే ఉంటుందని శుక్రవారం వెల్లడించినట్లు చెబుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో జనసేన పక్షాన పోటీ చేసిన నవుడు వెంకటరమణ శుక్రవారం సీఎం సమక్షంలో వైసీపీలో చేరారు.



టీడీపీ, జనసేన నాయకుల అభివాదం

మూడో వ్యక్తికి ఛాన్స్ ఇవ్వొద్దు

- పోలవరం సీటు టీడీపీ బొరగం లేదా జనసేన చిర్రికి కేటాయించాలి
- కొయ్యలగూడెంలో ముఖ్య నాయకుల సమావేశం డిమాండ్

కొయ్యలగూడెం, మార్చి 15 : 'పోలవరం నుంచి పొత్తులో భాగంగా కూటమిలోని ఏ పార్టీ బరిలోకి దిగుతుందో.. ఆ పార్టీలో కష్టపడ్డ వ్యక్తికే టిక్కెట్ కేటాయించాలి' అని నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. కొయ్యలగూడెంలో శుక్రవారం టీడీపీ, జనసేన ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటుచేశారు. ఐవీఆర్ఎస్‌లో జనసేన అభ్యర్థులుగా మొడియం సూర్యచంద్రరావు, కుంజా వసంత విజయలో ఎవరిని నిలపాలని సర్వే చేశారు. దీనిపై ఇరు పార్టీల నాయకులు మండిపడ్డారు. ఈ సీటును కూటమిలోని టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కు లేదా జనసేన కన్వీనర్ చిర్రి బాలరాజుకు కేటాయించాలని, అలా కాకుండా మరో వ్యక్తి కి సీటు కేటాయిస్తే కుదరదని స్పష్టం చేశారు. బొరగం శ్రీనివాస్, చిర్రి బాలరాజు, కరాటం సాయిబాబు, పారేపల్లి రామారావు, శీలం వెంకటేశ్వరరావు, ముగపర్తి సోంబాబు, తోట రవి, పారేపల్లి నరేష్, పోలవరం, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లి, కుక్కునూరు. వేలేరుపాడు నుంచి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఎలక్షన్ కమిషన్ రూల్స్ పాటించాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, మార్చి 15 : ప్రతి ఒక్కరు ఎలక్షన్ కమిషన్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ పాటించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా నేర సమీక్షా సమావేశం ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఐజీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో శాంతి యుతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ట్రబుల్ మంగర్స్, గత ఎన్నికల సమయంలో క్రిమినల్ కేసులు నమోదై ఉన్న వారిని ముందుగా బైండోవర్ చేసి వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. అధికారులందరూ ఎన్నికలు సజావుగా సాగేందుకు ముందుగానే సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ స్వరూపరాణి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆది ప్రసాద్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, ఏలూరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఏలూరులో బీజేపీ శ్రేణుల ర్యాలీ

ఏలూరు ఎంపీ టిక్కెట్ ఇస్తే గెలుస్తా

- బీజేపీ కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమావేశంలో తపనా చౌదరి

ఏలూరు టూటౌన్, మార్చి 15:'ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నేను అన్ని విధాలా అర్హుడను. ఎన్నికల సమయంలో ఎవరో వలస పక్షుల్లా వచ్చి టిక్కెట్లు తన్నుకుపోతున్నారు. అలాంటి వారు ఎన్నికల తర్వాత కనిపించరు. క్రమశిక్షణ గల కార్యకర్తగా ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ఎంపీ టిక్కెట్‌ను నాకు కేటాయించండి. గెలుస్తా' అంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఏలూరులో శుక్రవారం కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'మధ్య తరగతి రైతుబిడ్డగా ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా. ఎంపీ టిక్కెట్ కేటాయిస్తే గెలిచి ప్రధాని మోదీ ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టును పూర్తయ్యేందుకు కృషి చేస్తా. ఏలూరు పార్లమెంట్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ను రూ.100 కోట్లతో ఏర్పాటుచేసి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తా'నని అన్నారు. పొత్తులో భాగంగా చౌదరికి టిక్కెట్ కేటాయిస్తే గెలుపు తథ్యమని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ అన్నారు. పలువురు నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ 16 ఏళ్ల నుంచి తపన ఫౌండేషన్ ద్వారా జిల్లా ప్రజలకు ఎన్నో సేవలందిస్తున్న చౌదరికి టిక్కెట్ కేటాయించాలని కోరారు. చౌదరికి టిక్కెట్ ఇవ్వాలంటూ నగరంలో బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. మఠాధిపతి కృష్ణాచరణానంద భారతి, హైకోర్టు న్యాయవాది గోపీనాథ్ మాట్లాడుతూ తపన చేసిన సేవలను గుర్తించాలన్నారు. జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు, నారా శేషు, ఆర్ఎస్ఎస్ సంచాలక్ ఎ.దుర్గాప్రసాద్, బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు ముడియం శ్రీనివాస్, గాది రాంబాబు పాల్గొన్నారు.

మా మధ్య అపోహలు లేవు

తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థి బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 15 : 'తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ ను టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటించారు. బొలిశెట్టితో కలిసి అన్ని విషయాలు మాట్లాడుకున్నాం. కేడర్‌ను ముందుండి ఎలా నడిపించాలనే దానిపై చర్చించాం. మా ఇద్దరి మధ్య పూర్తి అవగాహన ఉంది. దీని ప్రకారమే పని చేసి తాడేపల్లిగూడెంను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. ఇప్పటి వరకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వాటిని అధిగమిస్తాం. అధిష్ఠానం పిలుపు మేరకు టీడీపీ శ్రేణులందరూ కూటమితో కలిసి నడవాలి. ఈ మేరకు శనివారం స్థానిక మాగంటి కల్యాణ మండపంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. దీనికి అందరూ హాజరుకావాలి' అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి చెప్పారు. శుక్రవారం బాబ్జిని ఆయన నివాసం వద్ద బొలిశెట్టి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికలలో ఎలా వెళ్లాలనే దానిపై ఇరువురి నేతలు చర్చించుకున్నారు.

క్యూఆర్ కోడ్‌తో అక్రమార్కులను పట్టేస్తాం..

టెన్త్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : పదో తరగతి పరీక్షలు ఈనెల 18నుంచి 30వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో పరీక్షల్లో అక్రమాలు నిరోధించే చర్యల్లో భాగంగా ప్రతీ ప్రశ్నపత్రం పైనా క్యూఆర్ కోడ్‌ను ముద్రించారని, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు తలెత్తితే సంబంధిత పరీక్షా కేంద్రాన్ని ఇట్టే పసిగట్టేయడమేగాక బాధ్యులపై చట్టపర చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ హెచ్చరించారు. ఎస్ఎస్‌సీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. 'పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఏ ఒక్క విద్యార్థిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోరు. జిల్లాలో పరీక్షలు జరిగే 139 కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి లోటుపాట్లు ఏవైనాఉంటే చక్కదిద్దండి. పరీక్ష కేంద్రాలను 'నో సెల్ ఫోన్' జోన్‌గా ప్రకటించాం. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. జిల్లాలో 32,355 మంది రెగ్యులర్, ప్రైవేటు విభాగాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉం టుంది.' అని సూచించారు. ఏఎస్పీ శేఖర్, డీఈవో అబ్ర హం, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, డీటీసీ శాంతకుమారి, ఎన్‌డీసీ ముక్కంటి, ట్రాన్స్‌కో ఎసీఈ సాల్మన్‌రాజు, ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాదరావు, జడ్పీ సీఈవో నిర్మలజ్యోతి, తపాలా శాఖ, రిజర్వ్ పోలీసు విభాగం అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రధాన పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : ఇంటర్మీడియట్ ప్రధాన థియరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున జరిగిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు జిల్లాలో జనరల్ విభాగంలో 11,958 మంది, ఒకేషనల్ విభాగంలో 992 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాక రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బ్రిడ్జి కోర్సులకు సంబంధించి ఈనెల 16, 18 తేదీల్లో 12 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 15 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జేసీ బి.లావణ్యవేణితో కలిసి శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యోగుల నుంచి మొత్తం 14 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కలెక్టరేట్ ఏవో కె.కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు రూ.లక్షల వసూళ్లపై విచారణ

హాజరుకాని ఫిర్యాదుదారు.. ఆరోపణలు అవాస్తవం : డీఎంహెచ్‌వో

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సు ఉద్యోగాలు ఇప్పించేందుకు ఆరుగురు అభ్యర్థినుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు జరిగాయంటూ అభియోగాలు మోపుతూ రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు ఒకరు ఫిబ్రవరి 24న చేసిన ఫిర్యాదుపై శుక్రవారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రాష్ట్ర అధికారుల బృందం విచారణ నిర్వహించింది. రాష్ట్ర డైరెక్టరేట్ మలేరియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ రామనాథం ఆధ్వర్యంలోని విచారణ బృందం దాదాపు ఐదు గంటలపాటు నిరీక్షించినప్పటికీ ఫిర్యాదు చేసిన వ్యక్తులెవరూ రాకపోవడంతో జిల్లా అధికారుల స్టేట్‌మెంట్లను తీసుకుని తిరుగు పయనమయ్యారు. ఫిర్యాదులో పేర్కొన్న జి.అరుణ అనే మహిళ ఉద్యోగార్థుల జాబితాల్లో ఎవరూ లేరని, సంబంధిత చిరునామా కూడా తప్పుడుదేనని తేల్చారు. దీంతో ఫిర్యాదుదారులెవరైనా ఈ నెల 15న నిర్వహించే విచారణకు తమ వద్దనున్న ఆధారాలతో హాజరు కావాలని ఉన్నతాధికారులు బహిరంగ ప్రకటన ఇచ్చారు. మరోవైపు విచారణకు ఎవరూ హాజరు కాకపోవడంతో నిరాధార ఆరోపణలతో ఆకాశరామన్న లేఖలతో ఫిర్యాదు చేసినట్టు నిర్ధారించుకున్నట్టు అధికార వర్గాలు వివరించాయి. కొంత కాలంగా తమ శాఖపై బురదజల్లే లక్ష్యంతో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తాజా విచారణతో మరోసారి రుజువైందని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాలు ఏవైనా నోటిఫికేషన్ మొదలుకుని కౌన్సెలింగ్ వరకు పారదర్శకంగా జరుగుతాయని, దీనికి అతీతంగా రూ.లక్షలు ఇస్తే ఉద్యోగ నియామక పత్రాలను అభ్యర్థుల ఇళ్లకే పంపుతారంటూ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వివరణ ఇచ్చారు.

మరో 9 మంది వైద్య ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఇక మిగిలింది ఎనిమిది మందే

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో తాజాగా మరో 9 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ జీవోలు జారీఅయ్యాయి. జీవో 49లో ఎంపీహెచ్‌ఏ (మేల్) ముగ్గురికి, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరికి, జీవో 50లో ఎంపీహెచ్‌ఏ (ఫీమేల్) /ఏఎన్‌ఎంలు ఐదుగురికి సర్వీసు రెగ్యులరైజేషన్ లభించింది. ఇక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన వాటిలో ఇంకా ఎంపీహెచ్‌ఏ (మేల్) ఆరుగురికి, ఫార్మసిస్టులు ఇద్దరికి రెగ్యులరైజేషన్ జీవోలు జారీ కావాల్సి ఉంది. వీరికి శుక్రవారం రాత్రిగాని లేదా శనివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందుగాని జీవోలు జారీ అయ్యే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కాగా శుక్రవారం జీవోలు జారీ అయిన 9 మంది ఉద్యోగులకు శనివారం రెగ్యులరైజేషన్ పత్రాలు అందజేయనున్నారు.

30 మంది టీచర్లకు దొడ్డిదారి బదిలీలు !

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : కౌన్సెలింగ్‌కు అతీతంగా గవర్నమెంట్ ఆర్డర్ల పేరిట ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 30 మంది ఉపాధ్యాయులకు బదిలీల తతంగం పూర్తయింది. దొడ్డిదారిన నిర్వహించిన ఈ బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలతోపాటు, రూ.లక్షలు సమర్పించుకున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజులుగా తెరవెనుక జరుగుతున్న ఈ వ్యవహారంలో ఉమ్మడి జిల్లాలోని మండలాలను కొత్త జిల్లాల వారీగా విభజిస్తే ఏలూరు జిల్లాలో 14 మందికి, రాజమండ్రి కేంద్రంగా వున్న తూర్పు గోదావరి జిల్లా, భీమవరం కేంద్రంగావున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 16 మంది టీచర్లకు బదిలీలు ఖరారయ్యాయి. ఈ మేరకు ఆయా బదిలీ స్థానాలకు నియామక పత్రాలను డీఈవో కార్యాలయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే జారీచేసింది. ఈ బదిలీలు పొందిన వారంతా ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి పని దినమైన ఏప్రిల్ 30న ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ అయ్యి నూతన బదిలీ స్థానాల్లో చేరాల్సి ఉంటుంది. బదిలీలు పొందిన వారిలో ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు 32 బెంచ్‌లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్


ఏలూరు క్రైం, మార్చి 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం 32 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో జడ్జి రత్నప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌లో పరిష్కరించడానికి 8,152 కేసులను గుర్తించామన్నారు. కక్షిదారులు నేరుగా గాని తమ న్యాయవాది ద్వారా కాని సంబంధిత కోర్టు పరిధిలోని మండల లీగల్ సర్వీస్ కమిటీలను కాని, జిల్లా న్యాయసేవాధికార సంస్థను కాని సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం వృథా కాదని ఇరుపక్షాలు స్నేహ పూర్వకంగా ఇరువురి ఇష్టపూర్వకంగానే కేసు పరిష్కరిస్తామన్నారు. సివిల్ కేసులలో కోర్టు ఫీజులను తిరిగి ఇస్తారన్నారు.

రజకులకు చెరువులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య

ఏలూరు రూరల్, మార్చి 15 : రజక వృత్తిదారుల చెరువులపై గ్రామ పంచాయతీల అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారని, ఫలితంగా రజక వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని, రజక జన సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు చిలకపల్లి కట్లయ్య అన్నారు. శుక్రవారం జిల్లా సంఘ భవనంలో జరిగిన సమావేశంలో కట్లయ్య మాట్లాడుతూ ఈదర గ్రామంలో మూడు చెరువులు ఉన్నప్పటికి ఒక్క చెరువు కేటాయించకపోవడంపై మండిపడ్డారు. రజ కుల వృత్తి నిర్వహణకు చెరువులను కేటాయించి, ఉతికిన బట్టలు ఆరబెట్టు కోవడానికి చెరువు పక్కన ఉన్న 40 సెంట్ల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈదర గ్రామ రజక సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.నారాయణ, కార్యదర్శిగా బి.గోపిరాజు, సలహా సభ్యులుగా ఎ.జమలయ్య తదితరులను ఎన్నుకున్నారు.

భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ

తణుకు, మార్చి 15 : సమస్యల పరిష్కారంలో విఫలమైన జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి భవన నిర్మాణ కార్మికులు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పడాల రమణ ధ్వజమెత్తారు. శుక్రవారం తణుకు ఏఐటీయూసీ అను బంధ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆరో మహాసభ నిర్వహించారు. సభకు జిల్లా ఉపాధ్యక్షుడు నరాల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సత్యనా రాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నా రని, వారి జీవన స్థితిగతులు దుర్భరంగా ఉన్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికు లకు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సంఘ ప్రదాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ బోర్డులో నిల్వ నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి కార్మికుల కడుపు కొట్టిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మళ్ళీ గెలిపించాలని ఏముఖం పెట్టుకుని కార్మికులను అడుగుతున్నారని ప్రశ్నించారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేయ డానికి కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి సుమారు మూడు లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారని జిల్లా ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. హక్కుల కోసం సుదీర్ఘ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించాలని కోరారు. సీనియర్ నాయకులు ఇంటి వీరన్న, గండి రామకృష్ణ, పులపర్తి సర్వేశ్వరరావు, పడాల శ్రీనివాసు, జిల్లా కార్యదర్శి బొల్లాడ నాగరాజు తదితరులు మాట్లాడారు.

నూతన కార్యవర్గం : సంఘం గౌరవాధ్యక్షుడిగా డి.సోమసుందర్, అధ్యక్షుడిగా బొల్లాడ నాగరాజు, కార్యదర్శిగా పోలిరాతి ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మైలవరపు శ్రీరాంబాబు, కోశాధికారిగా ఏడిద గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా అంకం భాస్కరరావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

పకడ్బందీగా గ్రూప్ -1 పరీక్షలు

రేపు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహణ

ఉమ్మడి జిల్లాలో 12 కేంద్రాలు.. 8,581 మంది అభ్యర్థులు


భీమవరంలో మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు నవజ్యోతి, విజయ నిర్మల ..


ఏలూరులో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు కలెక్టరేట్/భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 15 : ఉమ్మడి జిల్లాలో ఈ నెల 17న నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏలూరు జిల్లాలో ఐదు కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షకు 4,372 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని గ్రూప్-1 జిల్లా సమన్వయ అధికారి, జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలలో 4,209 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు పి.నవజ్యోతి, బి.విజయ నిర్మల తెలిపారు. పరీక్షకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్, లైజన్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 'పరీక్షల నిర్వహణకు ఐదు సెంటర్లు ఏర్పాటుచేశాం. వీటికి ఐదుగురు లైజన్ ఆఫీసర్లను నియమించాం. సీఆర్ రెడ్డి కళాశాలకు పశు సంవర్థకశాఖ జేడీ జి.నెహ్రూబాబు, సీఆర్ రెడ్డి బాలికల డిగ్రీ కళాశాలకు సెట్‌వెల్ సీఈవో మెహర్రాజ్, సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలకు ఏపీజీఎల్ఐ డీడీ కె.శ్రీనివాసవరప్రసాద్, సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలకు మత్స్య శాఖ అధికారి వి.నాగలింగేశ్వర్‌ను నియమించాం. పరీక్షలు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయి. గంట ముందే అంటే తొమ్మిది గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. సమయం దాటిన తర్వాత పరీక్షకు అనుమతించం. కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్య లేకుండా చూడాలి. పరీక్ష రాసేందుకు వీలుగా ఆర్టీసీ సర్వీసులు నడపాలి' అని సూచించారు. ఆర్డీవో ఖాజావలీ, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి జి.అశోక్, ఎం.విజయ్‌కుమార్, పరీక్ష సూపరిం టెండెంట్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. **భీమవరం** కలెక్టరేట్‌లో పరీక్ష కేంద్రాల లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, సంబంధిత అధికారులతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరీక్షల కోసం ఏడుగురు రూటు ఆఫీసర్లు, ఏడుగురు లైజనింగ్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి జి.గణపతిరావు, జిల్లా నీటిపారుదల అధికారి కె.గంగాధర రావు, హౌసింగ్ ఈఈ వెంకటరమణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఫిషరీస్ అధికారి ప్రసాద్, జిల్లా పబ్లిక్ అధికారి విజయ, కలెక్టరేట్ సూపరిండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు


ఏలూరు గన్ బజార్ సమీపంలో వున్న మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఏలూరు కల్చరల్, మార్చి 15:రంజాన్ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏలూరు, భీమవరం, ఆకివీడు, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం, నరసాపురం తదితర ప్రాంతాల్లోని ప్రధాన మసీదులు కిటకిట లాడాయి. ఉపవాసాలు ఉన్న ముస్లింలు వేకువజాము నుంచి ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఏలూరులోని మసీదుల వద్ద గంజి పంపిణీ చేశారు. ముస్లిం మత గురువులు ప్రేమ, ధానం, త్యాగాల గొప్పతనాన్ని తెలిపారు. ఖురాన్ ప్రవచనాలు వినిపించారు. రంజాన్ నెల అంటేనే పవిత్రమైన ప్రేమకు, మానవతా విలువలకు గుర్తింపు పొందిన మాసంగా భావించి ప్రతి ముస్లిం భక్తి శ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్ష చేసి శాంతియుతమైన సుఖజీవితం ఇవ్వమని అల్లాను వేడుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఇఫ్తార్ స్వీకరిస్తున్న ముస్లింలు

జనం చెవిలో పూలు !



హడావుడి ప్రారంభోత్సవాలు..శంకుస్థాపనలు

ప్రజల్ని మభ్య పెట్టే పనిలో ప్రభుత్వం

ముఖ్యమంత్రి శంకుస్థాపనలకే దిక్కులేదు

ఎన్నికల ముంగిట అధికార పార్టీ నాయకులు బిజీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కళ్లుమూసుకుంది. ఎన్నికలు మరో నెల రోజులు ఉండగా అభివృద్ధి అంటూ హడావుడి చేస్తోంది. గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్‌లు, కమ్యూనిటీ హాళ్ల అంటూ అధికార పార్టీ నేతలు జనం చెవిలో పూలు పెడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపనలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే తంతు జరుగుతోంది. ఎన్నికల ముందు టెండర్‌లు ఖరారు చేశారు. పనులు అప్పగిస్తున్నారు. అయితే ప్రస్తుత వేసవిలో పనులు పూర్తయ్యే అవకాశమేలేదు. కాంట్రాక్టర్‌లే నమ్మకం కోల్పోయారు.ప్రస్తుతం పనులు పూర్తి చేస్తే రాబోయే ప్రభుత్వంలో బిల్లులు చెల్లిస్తారన్న గ్యారంటీ లేదు. అయితే అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు మాత్రం ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేస్తున్నారు. శిలాఫలకాలు వేస్తున్నారు. ఆకివీడు రూరల్ మండలంలో జలజీవన్ మిషన్ పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు చేసేశారు. పనులు పూర్తి కాకుండానే శిలాఫలకాలు అమర్చారు. జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే తంతు సాగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి సచివాలయ పరిధిలోనూ శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అందుకోసం ప్రభుత్వ నిధులనే వెచ్చించారు.

పనులు సున్నా

తాడేపల్లిగూడెంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి మంత్రి కొట్టు సత్యనారాయణ మరోసారి శంకుస్థాపన చేశారు. అధికారం చేపట్టిన తొలి రోజుల్లో ఒకసారి పనులు ప్రారంభించారు. తెలుగుదేశం హయాంలో టెండర్‌లు ఖరారైన పనులకు కొట్టు భూమి పూజ చేశారు. అనంతరం సదరు కాంట్రాక్టర్ పనులు చేయ లేమంటూ చేతులెత్తేశారు. దాంతో పనులు రద్దు చేశారు. కొత్తగా అమృత్ 2.0లో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ప్రాజెక్ట్ మరోసారి మంజూరు చేశారు. అయినా ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ఏడాదిన్నర నుంచి అధికారులు ప్రభుత్వ అనుమతులు కోసం ఎదురు చూస్తు న్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూరు తాయన్న ధ్యాస కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొరవడింది. పరిపాలన అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేసింది. ఎన్నికల్లో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఒక అంశంగా మారుతుందన్న ఉద్దేశంతో హడావుడిగా అనుమతులు ఇచ్చారు. టెండర్లు ఖరారు చేశారు.దానికి మళ్లీ ఇప్పుడు మంత్రి భూమి పూజ చేశారు. అంటే ఐదేళ్లపాటు నిద్రావస్థలో ఉన్నారు. తాడేపల్లి గూడెం ప్రజలకు సక్రమంగా మంచినీటిని సరఫరా చేయలేకపోయారు. నెల రోజులు ఎన్నికలు ఉన్నాయనగా భూమి పూజ చేశారు. అంటే రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌పై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. జిల్లాలో ఇలా ముఖ్యమైన ప్రాజెక్టలన్నీ శంకు స్థాపనలకే పరిమిత మయ్యాయి. వాటిని పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. వాటిని పక్కన పెట్టి కొత్తపనులకు మళ్లీ శంకుస్థాపనలు చేస్తూ అధికార పార్టీ నేతలు జనాలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

వీటి సంగతేమిటో...

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో రూ. 3200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వాటి పనులు ఒక్కటి కూడా ప్రారంభానికి నోచుకోలేదు. తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టలన్నీ పడకేశాయి. గణపవరం, మొగల్తూరులో ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన సబ్‌స్టేషన్ పనులు కూడా ప్రారంభం కాలేదు. మెడికల్ కళాశాల సైతం పునాది రాయి దాటలేదు. ఎన్నికల ముందు ఒకటి రెండు రహదారులను అభివృద్ధి చేశారు. కొత్త రహదారులకు కాంట్రాక్టర్‌లు టెండర్‌లు వేయలేదు. అటువంటిది ఇప్పుడు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ శంకుస్థాపనలతో అధికార పార్టీ నేతలు బిజీగా ఉంటున్నారు. పనులయ్యే పరిస్థితి మాత్రం కానరావడం లేదు. శనివారమే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది.గడచిన నెల రోజులనుంచి అధికార పార్టీ నేతలు,ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలతో బిజీగా ఉన్నారు.

క్రైం కార్నర్

ఈత కొట్టేందుకు వెళ్లి ఇంటర్ విద్యార్థి మృతి


మహేంద్ర (ఫైల్)

జంగారెడ్డిగూడెం, మార్చి 15 : ఇంటర్ పరీక్షలు ముగియడంతో స్నేహితులతో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు కాలువలో మునిగి మృతి చెందాడు. మండలంలోని ఎర్రకాలువ పంట కాలువలో స్నానానికి దిగి పట్లగట్లగూడెం గ్రామానికి చెందిన లింగిశెట్టి మహేంద్ర(17) శుక్రవారం మృతి చెందాడు. శుక్రవారం ఇంటర్మీడియట్ ఆఖరి పరీక్ష రాసిన మహేంద్ర, అతని స్నేహితులు 12 మంది ఎర్ర కాలువ ప్రాంతానికి వెళ్లారు. స్నానానికి దిగిన మహేంద్ర ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. దీంతో సహచర విద్యార్థుల సమాచారంతో స్థానికులు మహేంద్రను వెలికి తీసి జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు.వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్కవరం ఎస్ఐ సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

39 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

టి.నరసాపురం, మార్చి 15 : రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన జూలూరి కరుణకుమార్, కామన శ్రీని వాస రావు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొని వాటిని అధిక ధరకు విక్రయిస్తున్నారనే సమాచారంతో డిప్యూటీ తహసీల్దార్ ఉదయభాస్కర్, విజిలెన్స్ అధికారులు గుర్తించి వారిని పట్టుకుని వారి వద్ద నుంచి 39 క్వింటాళ్ల బియ్యం స్వాధీన పరుచుకున్నారు. డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటార్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

పెంటపాడు, మార్చి 15 : జిల్లాలోని పలు ప్రాంతాలలో మోటార్ల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ మోహన్‌రావు తెలిపారు. భీమవరానికి చెందిన వేండ్రపు దుర్గాశ్రీనివాస్, టేకు మూర్తిలు చెరువులు, పొలాల వద్ద మోటార్లు, ఫ్యాన్ సెట్లు దొంగతనాలు చేసేవారు. భీమవరం రూరల్ పరిధిలో 3, మొగల్తూరు పరిధిలో 1, పెంటపాడు పరిధిలో 2 మొత్తం ఆరు మోటార్లు దొంగతనం చేశారు. గురువారం రాత్రి ముదునూరు శివారులో నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి శుక్రవారం తాడేపల్లి గూడెం కోర్టులో హాజరు పరచగా కోర్టు ఇద్దరికి ఈనెల 27 వరకూ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.


భీమడోలులో అక్రమ మద్యాన్ని పారబోస్తున్న అధికారులు

రూ.లక్ష విలువైన అక్రమ మద్యం ధ్వంసం

భీమడోలు, మార్చి 15 :భీమడోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం సమీపంలో ఇటీవల వివిధ ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న లక్షా ఐదు వేల విలువైన మద్యం, నాటు సారాలను అధికారులు ధ్వంసం చేశారు. ఏలూరు ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ సమక్షంలో ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన 240 లీటర్ల నాటుసారా, 482 మద్యం సీసాలు, ఎన్‌డీపీఎల్ కోసం సుంకం చెల్లించని 84 మద్యం సీసాలను ధ్వంసం చేశారు. భీమడోలు ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ గిరిజకుమారి సిబ్బందితో ఇటీవల దోరసానిపాడు, తిరుమలపాలెం, జి.కొత్తపల్లి గ్రామాల్లో విస్తృత దాడులు జరిపి అక్రమ మద్యంపై కేసులు నమోదుచేశారు.

ఏలూరు జిల్లా సమీపంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లోను పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ గిరిజ కుమారి తెలిపారు. అక్రమ మద్యంపై ఎటువంటి సమాచారం ఉన్నా 94409 02434, 94409 02429 నెంబర్లకు సమాచారం అందించాలని కుమారి కోరారు.


అధికారులతో వాగ్వాదం చేస్తున్న పాటదారులు

ఆలయ దుకాణాల వేలం పాటలో ఉద్రిక్తత

పాట నిర్వహించాలని కొందరు.. వాయిదా వేయాలని మరికొందరు

పెట్రోల్ పోసుకుని ఒకరు ఆత్మహత్యాయత్నం

కుర్చీలు ధ్వంసం..చివరికి పాట వాయిదా


పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న పాటదారుడు.. ఆస్పత్రికి తీసుకెళుతున్న పోలీసులు



నరసాపురం, మార్చి 15 : కపిల మల్లేశ్వరస్వామి ఆలయ దుకాణాల వేలంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వేలం నిర్వహించాలని కొందరు, వాయిదా వేయాలని మరి కొందరు వాగ్వాదానికి దిగారు. కొందరు కుర్చీలు ధ్వంసం చేశారు. ఒక పాట దారుడు వేలం రద్దు చేయాలంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. దీంతో అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. నరసాపురం గాంధీ బొమ్మ సెంటర్‌లోని కపిలమల్లేశ్వర స్వామి ఆలయానికి 11 దుకాణాలు ఉన్నాయి. అధికారులు వీటికి ఇప్పటి వరకు మూడుసార్లు వేలం పాట పెట్టారు. ప్రతిసారి ఏదో కారణంతో వాయిదా పడుతూ వస్తోంది. ఈసారి ఎలాగైనా పాట నిర్వహించేందుకు భీమవరం నుంచి దేవ దాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరావు విచ్చేశారు. 26 మంది ధరావత్తు కట్టి పాటలో పాల్గొన్నారు. పాటను రద్దు చేయాలని, ప్రస్తుతం ఆ దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారు అధికారులను కోరారు. దీనికి పాడేందుకు వచ్చిన పాట దారులు అభ్యంతరం తెలిపారు. ఎలాగైనా పాట నిర్వహించాలని పట్టు బట్టారు. ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రస్తుతం దుకాణాల్లో ఉంటున్న ఓ వ్యాపారి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్న పోలీసులు అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత ఇదే పరిస్థితి నెలకొంది. అన్యమతస్తులకు దుకాణాలు ఎలా ఇచ్చారంటూ కొందరు పాట దారులు దేవస్థానం అధికారులను నిలదీశారు. తమ దృష్టికి రాలేదని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కొందరు కుర్చీలు పగులగొట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వాయిదా వేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావు ప్రకటించారు. కార్యక్రమంలో ఈవో వేణుగోపాల్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


వివాదాస్పద స్థలం వద్ద ఆందోళనకారులు

ఎమ్మెల్యే రంగరాజుకు ఎదురుదెబ్బ

బ్రాహ్మణచెరువు వివాదాస్పద స్థలంలో రాళ్లు పాతించిన ఎమ్మెల్యే.. అడ్డుకున్న కాలనీ వాసులు


సంఘటన స్థలం వద్ద పోలీసులు

పెనుమంట్ర, మార్చి 15 : పెనుమంట్ర శివారు బ్రాహ్మణచెరువు కాలనీవాసులకు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు మధ్య శుక్రవారం వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సుమారు పది సంవత్సరాల క్రితం బ్రాహ్మణ చెరువులో పేదలకు స్థలాలు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరి పెద్దల కన్ను ఈ కాలనీలో రిజర్వుడ్ స్థలంపై పడింది. కాలనీ భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన రిజర్వుడు స్థలాన్ని కొందరు వైసీపీ బడా బాబులు ఇటీవల ప్లాట్లుగా విభజించారు. గుట్టు చప్పుడుకాకుండా ఈ ప్లాట్‌లను కొంతమంది లబ్ధిదారులకు అనధికార విక్రయాలు చేసి పెద్ద ఎత్తున సొమ్ములు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కాలనీవాసులు ఆందోళన చేపట్టడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే రంగనాథరాజు కాలనీ పరిశీలనకు వచ్చి రిజర్వుడు స్థలంలో విభజించిన ప్లాట్లకు సరిహద్దు రాళ్లు వేయించారు. దీంతో ఎమ్మెల్యేకు కాలనీ వాసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పెనుమంట్ర పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. మహిళల పట్ల గౌరవం ఉందని చెప్పుకునే ఎమ్మెల్యే మహి ళల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, పోలీసులతో కేసులు పెట్టాలని భయపెట్టడం సరికాదని మేము ఓటు వేస్తే గెలిచి ఇప్పుడు ఇలా వ్యవహరించడం దారుణమని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు మరోసారి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.


మట్టిని ట్రాక్టర్లపై లోడ్ చేస్తున్న దృశ్యం

రాత్రివేళ దర్జాగా తవ్వేశారు..

తాటియాకులగూడెంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

జీలుగుమిల్లి, మార్చి 13: జీలుగుమిల్లి మండలంలో మట్టి మాఫియాకు అధికార పార్టీ నాయకులు తెర తీశారు. రేపో మాపో ఎన్నికల కోడ్ వస్తుందని భావించిన అధికార పార్టీ మండల నాయకుడి అస్మదీయులు కొందరు, వార్డు మెంబర్లకు ప్రస్తుతం పార్టీ నుంచి ఎటువంటి ఆదాయం లేకపోవడంతో మట్టే ఆదాయ వనరుగా మారింది. తాటియాకులగూడెం బుడుగుల చెరువు సమీపంలో గట్టు నుంచి మట్టిని తవ్వి తరలించేశారు. రాత్రికి రాత్రి మూడు ఎక్స్‌కవేటర్లు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఏర్పాటు చేసి రూ. పది లక్షల విలువ చేసే మట్టిని అక్రమంగా అమ్ముకున్నారని స్థానికంగా చర్చ సాగుతోంది.జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్య పాలెంకు చెందిన పలువురు అధికార పార్టీ కార్యకర్తల ఇళ్ల వద్ద ఖాళీ జాగాల్లో ఇళ్ల నిర్మాణ స్థలాల యజమానులతో ముందుగా బేరం కుదుర్చుకుని అడ్వాన్స్‌లు తీసుకుని అక్రమంగా మట్టిని తోలారు.కొందరు స్థానికులు అక్రమ మట్టి తవ్వకాలపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిఘా వర్గాలు ఆరా తీశాయి. ఆ సమయంలో అధికార పార్టీ నేత వారికి ఫోన్ చేసి మట్టి తోలకం ఆపి వేస్తున్నట్టు చెప్పడంతో కేసులు నమోదు కాకుండా చేశారు. కొద్దిసేపు వాహనాలు నిఘా వర్గాలు వెళ్లిన తర్వాత మరల మట్టి తోలకాలు చేపట్టి శుక్రవారం తెల్లవారే వరకు తోలారు.

ఆశీలు పాట మళ్లీ వాయిదా

» అధికార కార్పొరేటర్లకు కట్టబెట్టేందుకేనంటూ విమర్శలు



ఏలూరు టూటౌన్, మార్చి 15 : ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని ఆశీలు పాట మళ్లీ వాయిదా పడింది. తొలుత ఈనెల 7వ తేదీన జరగాల్సిన ఆశీలు పాట వాయిదా పడింది. మళ్లీ శుక్రవారం పాట నిర్వహిస్తారని అందరికి సమాచారం ఇచ్చారు. తీరా వచ్చిన వారందరికి నిరాశే మిగిలింది. పాటలో పాల్గొనడానికి ఐదుగురు సభ్యులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. తీరా ఆ సమయానికి నగర పాలక సంస్థ కమిషనర్ స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నానితో పలు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటున్నారని పాటను ఈ రోజు కూడా వాయిదా వేశారని తెలపడంతో వచ్చిన వారంతా నిరుత్సాహపడ్డారు. కమిషనర్‌కు సమయం లేనప్పుడు మమ్మల్ని ఎందుకు పిలవాలంటూ రెవెన్యూ సెక్షన్ అధికారులను నిలదీశారు. అసలు విషయం ఏమిటంటే అధికార పార్టీ కార్పొరేటర్లకు ఆశీలు పాటను కట్టబెట్టాలన్నదే ఎమ్మెల్యే ఉద్దేశమని గుసగుసలు వినిపిస్తున్నాయి. ముగ్గురు అధికార పార్టీ కార్పొరేటర్లు ఒక రింగుగా ఏర్పడి ఆశీలు పాటను తక్కువ ధరకు చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. అధికారులు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. గతేడాది చింతలపూడి పెద్దిరాజు 48 లక్షల 54 వేల రూపాయలకు ఆశీలు పాట పాడుకున్నారు. ఈ ఏడాది వాస్తవానికి 5 నుంచి 10 శాతం అధికంగా సర్కారు వారి పాట ప్రారంభించాల్సి ఉంది. కానీ రెవెన్యూ అధికారులు సర్కారు వారి పాట ఎంతకు నిర్ణయించారనేది తెలిసీ చెప్పలేకపోవ డం విడ్డూరంగా ఉంది. గత ఏడాదే తక్కువకు కేటాయించారనే విమర్శలు వెల్లువె త్తాయి. నగర జనాభా పెరిగింది. ఏడు గ్రామాలు విలీనం అయ్యాయి. వ్యాపారా లు పెరిగాయి. కనీసం ఆశీలు పాట ద్వారా రూ.కోటి పైగా వస్తుందని నిపుణులు తెలుపుతున్నారు. నగర పాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఆశీలు ఒకటి. కావాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై నగర పాలక సంస్థ ఆదాయా నికి గండి కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మళ్లీ ఎప్పుడు ఆశీల పాట నిర్వహిస్తారో ప్రకటించలేదు. ఈ నెలాఖరులోగానే ఆశీలు పాట నిర్వహించాల్సి ఉంది. కానీ అధికార పార్టీకి కట్టబెట్టే ప్రయత్నాల్లో భాగంగా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

జిల్లా సైనిక సంక్షేమ నిధికి రూ.లక్ష వితరణ



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న కోస్టల్ బ్యాంక్ సిబ్బంది

ఏలూరు కలెక్టరేట్, మార్చి 15:దేశరక్షణ కోసం సేవలు అందించిన మాజీ సైనికులను ఆదుకోవడం ప్రతిఒక్కరి విధి అని వారికి చేయూతను అందించడం విద్యుక్తధర్మ మని కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ అన్నారు. విజయవాడ ప్రధాన కార్యాలయంలో గత 25 ఏళ్లుగా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కోస్టల్ బ్యాంకు తమ సామాజిక బాధ్యతలో భాగంగా శుక్రవారం కలెక్టర్ చేతులమీదుగా సైనిక సంక్షేమనిధికి లక్షరూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కోస్టల్‌బ్యాంకు సీసీవో వై.సత్యనారాయణ, ఇతర బ్యాంకు అధికారులను కలెక్టర్ అభినందించారు. బ్యాంకు సీసీవో సత్యనారాయణ మాట్లాడుతూ తమ బ్యాంకు రూ.750కోట్ల డిపాజిట్లు కలిగి రూ.625రుణాలతో 50శాఖల ద్వారా అన్నివ ర్గాల వారికి అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటున్నా మన్నారు. బ్యాంకు క్లస్టర్ హెడ్ రామకృష్ణ, బ్రాంచి మేనేజరు ఎంవీఎల్ మాధురి, జిల్లా సైనికసంక్షేమ అధికారి కేవీ సాయిప్రసాదరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



చింతలపూడిలో కవాతు చేస్తున్న పోలీసులు

చింతలపూడి/పెదవేగి, మార్చి 15:సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా చింతలపూడిలో కేంద్ర సాయుధ బలగాల తో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. చింతలపూడి పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు సెం టర్ వరకు కవాతు నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్, ఎస్ఐ కుటుంబరావు పాల్గొన్నారు. పెదవేగి మండలం కొప్పాకలో సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అంకన్నగూడెం, కొప్పాక, పెదకడిమి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పోలీస్ దళంతో కవాతు నిర్వహించారు.

ఐదు అంశాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 :యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ప్రపంచ వినియో గదారుల హక్కుల దినోత్సవం జరిగింది. తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రో లర్ సుధాకర్ మాట్లాడుతూ మార్కెట్‌లో కొనుగోలుచేసే వస్తువుల విషయంలో పరిశీలించాల్సిన ఐదు రకాల అంశాలను వివరించారు. తయారీదారు చిరునామా, ఎంఆర్‌పీ రేటు, కాలపరిమితి తేదీ, బరువు, ప్యాకెట్‌లోని వస్తువుపేరు తప్పనిసరిగా పరిశీలించాల సూచించారు. డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్, సెట్‌వెల్ సీఈవో మెహర్రాజ్, లీగల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్, నేషనల్ కెరీర్ సర్వీసెస్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రవీణ్‌కృష్ణ, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలి'

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 15 :ఉపాధి హామీ పెండింగ్ వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కమిటీ సభ్యురాలు టి.ముత్యాలమ్మ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ బకాయిలు ఐదు కోట్ల రూపాయల వరకు ఉన్నాయని తక్షణమే విడుదల చేసి కూలీలకు అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్ర రావు, టి.సత్యనారాయణ, అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీతా, సత్తు కోటేశ్వరరావు, ఎస్.సాయికృష్ణ సుబ్బారావు మాట్లాడారు.

మినీ జాబ్‌మేళాలో 131మందికి ఉద్యోగాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 324మంది యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరుకాగా, పలు కంపెనీల్లో 131 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మరో 99మంది తదుపరి రౌండ్‌కు అర్హతలు సాధించారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ, ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, కో-ఆర్డినేటర్లు రాజేశ్వరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 :సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం దత్తతగ్రామం వైఎస్సార్ కాలనీలో వారంరోజులుగా నిర్వహి స్తోన్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ముగింపు వేడుకను జరుపుకు న్నా రు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పద్మావతి మాట్లాడుతూ వారం రోజులపాటు గ్రామంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. రాబోయేరోజుల్లో మరిన్ని కార్యక్రమా లను నిర్వహించేందుకు ప్రణాళిక చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వెల్లడించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీలత, బ్యూలా స్వరూపరాణి, అరుణ, పూజిత, విజయలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

'హౌస్ అరెస్టులు మానవ హక్కులకు భంగమే'

దెందులూరు, మార్చి 15 : వైసీపీ ప్రభుత్వమిచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి, హౌస్ అరెస్టులు చేయడం మానవ హక్కులకు భంగం కలిగించే ఇంతటి పిరికి ముఖ్యమంత్రిని ఇప్పటివరకు చూడలే దని టీఎన్ఎస్ఎఫ్ ఏలూరు పార్లమెంట్ విభాగం అధ్యక్షుడు పెనుబోయిన మహేష్‌యాదవ్ ఆరోపించారు. శుక్రవారం ముఖ్యమంత్రి గ్రూపు-1 పోస్టులను తనకు నచ్చిన వారికి అమ్ముకున్నారని ఆరోపిస్తూ ప్రచారం జరిగిన నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి చేసే అవకాశం ఉందనే భయంతో టీడీపీ నేతలను శుక్రవారం తెల్లవారుజామున నోటీసులు అందించి ఇంట్లోనే ఉండే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు ఒత్తిడి తేవడంతో ఇంట్లోనే ఉంటానని మహేష్‌యాదవ్ వాదించడంతో హౌస్ అరెస్టు చేశారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఇంటి వద్ద నుంచి పోలీసులు వెళ్లి పోయారు.





ప్రగడవరంలో సూపర్‌సిక్స్ కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు, ఏలూరులో బడేటి చంటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

కూటమి విజయం తథ్యం

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శ్యామ్ చంద్రశేషు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 15 : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసి న విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనమయ్యాయని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఇదే వి షయాన్ని జాతీయ సర్వే సంస్థలు చేపడుతున్న సర్వేల్లో తేటతెల్ల మవుతోందన్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 24లోక్ సభ, 160 అసెంబ్లీ సీట్లు గెలుస్తామన్నారు. జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కంపా రాజేంద్ర, మల్లిపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగడవరంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

చింతలపూడి, మార్చి 15: ప్రగడవరం పంచాయతీ నరసింగపురంలో బాబు ష్యూరిటీ సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం జరిపారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాళ్ళూరి చంద్రశేఖర్‌రెడ్డి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు నల్లగోపు కృష్ణమూర్తి, కొమ్ము తిరుపతిరావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సొంగా రోషన్ క్యాంప్ కార్యాలయం ప్రారంభం

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 15 : తెలుగుదేశం, జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయం పట్టణంలో శనివారం ప్రారంభించనున్నట్టు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ తెలిపారు. స్థానిక గ్రంథాలయం రోడ్డులో సాయంత్రం రోషన్ ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించే ర్యాలీ కార్యక్ర మానికి టీడీపీ, జనసేన బీజేపీ నాయకులందరూ పాల్గొనాలని టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, జనసేన టౌన్ అధ్యక్షుడు ఎస్‌కే పీరు కోరారు. నంబూరి రామచంద్రరాజు, బొబ్బర్ రాజ్ పాల్ కుమార్, వలవల తాతాజీ, చింతల నాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

ఏలూరు టూటౌన్, మార్చి 15: టీడీపీలోకి వలసల పర్వం కొనసాగు తుంది. పార్టీలోకి ఇతర పార్టీలకు చెందిన వ్యక్తులు చేరుతున్నారు. పట్టణంలోని 35, 40 డివిజన్లకు చెందిన వందలాది మంది శ్రీశయనసంఘ యువత వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పార్టీ కార్యాలయంలో బడేటి చంటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చంటి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర యువత భవిష్యత్తు సర్వనాశనం అయ్యిందన్నారు. టీడీపీ కూటమి ఏలూరు నియోజకవర్గంలో గెలుపు ఖాయమన్నారు. ముందుగా 23, 24 డివిజన్లలో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. భీమవరపు సురేష్, గూడవల్లి వాసు, కడియాల విజయలక్ష్మి, లంకపల్లి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీగా వస్తున్న మద్దిపాటి అభిమానులు



శ్రీవారి ఆలయంలో పూజలు

టీచర్ల దొడ్డిదారి బదిలీలు రద్దుచేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15 : పోరాటాల ద్వారా ఉపాధ్యాయులు సాధించుకున్న కౌన్సెలింగ్ విధానాన్ని అపహాస్యంచేస్తూ ప్రభుత్వమే దొడ్డిదారి సిఫారసు బదిలీలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం డీఈవో కార్యాలయంవద్ద ఉపాధ్యాయులు, సంఘనాయకులు ధర్నా నిర్వహించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈవిధంగా బదిలీలు చేయడం పట్ల సంఘనాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కోరిక మేరకే బదిలీలు చేస్తున్నామన్న ప్రభుత్వం అదే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాలు వ్యతిరేకిస్తున్న జీవో 117 ఉత్తర్వులు, అప్రంటీస్‌షిప్ విధానాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ, సిఫారసు బదిలీలను వెంటనే రద్దుచేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎన్నికల విధులనుంచి మినహాయింపునకు డీఈవోకు వినతి

సాధారణ ఎన్నికల విధులనుంచి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులప్రకారం ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న వారిని, శారీరక అంగవైకల్యం, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మినహాయించాలని అభ్యర్థి స్తూ డీఈవో అబ్రహంకు వినతిపత్రాన్ని అందజేసినట్టు యూటీఎఫ్ నాయ కులు తెలిపారు. ధర్నా అనంతరం డీఈవోను కలిసిన యూటీఎఫ్ జిల్లా నాయకుల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ముస్తఫాఅలీ, రవికుమార్, సుభాషిణి, పీవీ నరసింహారావు, రంగమోహన్, మోహన్‌రావు తదితరులున్నారు.



డీఈవో కార్యాలయ ఆవరణలో యూటీఎఫ్ నాయకుల ధర్నా

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి : ఏఎస్పీ



ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, మార్చి 15 : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నందున ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కోర్టు కానిస్టేబుళ్ళు, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో శుక్రవారం ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంగా ఉంటూ కేసుల్లో ముద్దాయి లకు శిక్షశాతం పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాజీ చేసుకోదగిన కేసుల్లో ఉభయ పక్షాల వారిని లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టడం వల్ల ప్రజలకు సమయం వృథా, డబ్బు వృథా కాకుండా ఉంటుందన్నారు. ప్రతిరోజు కోర్టులో జరిగే అంశాలపై స్థానిక ఎస్‌హెచ్‌వోలకు సమాచారం తెలపాలని, మరుసటి రోజు జరిగే విచారణకు సంబంధించిన సాక్ష్యులకు బ్రీఫింగ్ చేయడం ద్వారా కోర్టులో వారు సాక్ష్యం చెప్పడం ద్వారా శిక్షలు పడే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. నిబద్ధతతో పనిచేసి ముద్దాయిలకు శిక్షలు శాతం పెంచే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

కనీస వయసు రాకుండా వివాహం చేస్తే చర్యలు



కౌన్సెలింగ్ చేస్తున్న డీసీపీవో సూర్యచక్రవేణి

పెదవేగి, మార్చి 15 : కనీస వయస్సు రాకుం డా బాలలకు వివాహం చేయాలని చూస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని డీసీపీవో డాక్టర్ సూర్యచక్రవేణి హెచ్చరిం చారు. కొప్పాకలో 14 ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారనే సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ యూనిట్, ఐసీడీఎస్, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ అధికారులు తక్షణం స్పందించి, బాల్య వివాహాన్ని ఆపడమే కాకుండా బాలిక తల్లిదండ్రులు, వరుడి తల్లిదండ్రులను ఏలూరులోని బాలల సంరక్షణ కార్యాలయానికి పిలిపించి అవగాహన కల్పిం చారు. తల్లిదండ్రులతోపాటు బాలికకు బాల్య వివాహంపై అవగాహన కల్పించి, విద్యావసతి నిమిత్తం బాలికను వసతి గృహానికి పంపించామని చైల్డ్ హెల్ప్‌లైన్-1098 కో-ఆర్డినేటర్ వైవీ.రాజు తెలిపారు. ఐసీడీఎస్ పెదపాడు సీడీపీవో కె.విజయలక్ష్మి, కొప్పాక సెక్టారు సూపర్‌వైజర్ శాంత, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి కుసుమ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కమిటీ అధ్యక్షుడిగా రాజారావు

భీమడోలు, మార్చి 15 : భీమడోలులో జూనియర్ సివిల్ కోర్టు సమీపంలో జరిగిన సమావేశంలో న్యాయవాదుల ఆలిండియా లాయర్స్ యూనియన్ నూతన సంఘాన్ని ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు బి.శైలజ పాల్గొన్నారు. మొత్తం 11 మందిని నూతన కమిటీలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పి.రాజారావు, జనరల్ సెక్రటరీగా ప్రత్తిపాటి బాలాజీ, ఉపాధ్యక్షుడు తలారి వికాస్, జాయింట్ సెక్రటరీగా గొటి కల సంజయ్‌బాబు, ట్రెజరర్ పంట్ల శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. సభ్యులుగా జీవీ ప్రసాద్, కాళీ నాగేశ్వరరావు, ఈదా వెంకటరత్నం, అల్లాడి గంగాధరరావులను ఎన్నుకున్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

పెదవేగి, మార్చి 15 : క్రీసు చూపిన మార్గం అనుసరణీయమని విజయ వాడ పీఠం వెలగలగూడెం విచారణ గురువు ఫాదర్ డానియేల్ అ న్నారు. న్యాయంపల్లి గ్రామంలో జరుగుతున్న క్రీస్తులో నూత్నీకరణ మహా సభలు రెండోరోజు శుక్రవారం ఫాదర్ డానియేల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా విశ్వాసులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీస్తు రాకతో లో కానికి వెలుగు వచ్చిందన్నారు. న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ రాచూ రి బాలస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న మహాసభల్లో విశ్వాసులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు శబ్ద కాలుష్యాన్ని నివారించాలి

పోలవరం, మార్చి 15 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ శబ్దకాలుష్యాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సురేష్ కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం డీఎస్పీ కార్యాల యం వద్ద ఆయన మాట్లాడుతూ జిల్లాలో 135 పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, వాటిలో పోలవరం నియోజకవర్గపరిధిలో 7 మండలాల్లో 21 పరీక్ష కేంద్రాలున్నాయని తెలిపారు. ఆయా మండలాల పరిధిలో పరీక్షలు పూ ర్తయ్యేవరకు ఆయా గ్రామాల చర్చిలు, మసీదులు, హిందూ దేవాలయాలు నిర్వహించే సంబంధిత కమిటీల నాయకులు మైకులు, ఇతర శబ్ద కాలుష్యం చేసే పరికరాలను పరిమితి మేరకు మాత్రమే శబ్దం వినిపించేలా చేసుకో వాలని, ఏకాగ్రతకు భంగం లేకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

'జీతాల కోసం ప్రశ్నిస్తే చిన్నచూపు తగదు'

పోలవరం, మార్చి 15 :సకాలంలో జీతాలివ్వడం లేదని ప్రశ్నిస్తే వికలాం గులని కూడా చూడకుండా ఎంపీడీవో చిన్నచూపు చూస్తున్నారని శుక్రవారం పోలవరం ఎంపీడీవో కార్యాలయ ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆరోపించారు. ఈ విషయంపై పోలవరం ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించినట్టు వారు తెలిపా రు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు ప్రతినెలా జీతాలు క్రమంగా ఇవ్వడంలేదని, వడ్డీలకు అప్పులు చేసుకుని కుటుంబాలు గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని జీతాల కోసం ప్రశ్నిస్తే స్థానికంగా పనిచేస్తున్న ఎంపీడీవో తమపై వ్యక్తిగత కక్షతో వ్యవహరించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్ ఎ.హరేరామ్, అడిషనల్ కంప్యూటర్ ఆపరేటర్ కె.సుభాష్, పంపు మెకానిక్ టి.రాము, సహాయక పంపు మెకానిక్ బి.దుర్గాప్రసాద్, వాచ్‌మెన్ డి.రామ్‌ప్రకాశ్, స్వీపర్లు ఎం.బేబి, ఎం. నాగేశ్వరరావు ఉన్నారు.

మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు



పోలవరం, మార్చి 15 : రంజాన్ పవిత్ర మాసం తొలి శుక్రవారం సందర్భంగా పోలవరం అహెలె సున్నత్ జమాతె మసీదులో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్‌లు నిర్వహిం చారు. మండలంలో పలు ప్రాంతాల నుంచి రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు నమా జ్‌లు, ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది ముస్లిం సోదరులు పాల్గొన్నట్టు మసీదు కమిటీ అధ్యక్షుడు ఎం.డి. యాసిన్ షరీఫ్ తెలిపారు.

18 నుంచి పాటిమ్మ ఉత్సవాలు



దెందులూరు, మార్చి 15:సంతాన లక్ష్మిగా పేరొందిన చల్లచింతలపూడి- పెరుగుగూడెం గ్రామాల మధ్య స్వయంభువుగా వెలసిన గ్రామ దేవత పాటిమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం ఈనెల 18నుంచి ఐదురోజుల పాటు జరుగుతాయని ఆలయ ట్రస్టు చైర్మన్ యలమర్తి శ్రీనివాస్ హేమలత దంపతులు తెలిపారు. 18న పుట్టింటి సారెతో పాటు బోనాలతో పసుపు, కుంకుమ, 116 మంది ముత్తైదువులతో 116 కలశాలు, బిందెలతో బ్యాండు సన్నాయిలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవాలు ప్రారంభిస్తామని ఆఖరి రోజున వేలాది మంది భక్తుల సమక్షంలో నిప్పులగుండం నిర్వహిస్తామన్నారు.

షిరిడీ సాయిబాబా చిత్రపటం ఊరేగింపు



టి.నరసాపురం మార్చి 15 : బొర్రంపాలెం గ్రామంలో షిరిడీ సాయి బాబా ఆలయ వార్షికోత్స వాల్లో భాగంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయిబాబా చిత్ర పటాన్ని ట్రాక్టర్‌పై వుంచి పుర వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భూలక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం

జీలుగుమిల్లి, మార్చి 15 : దర్భగూడెం గ్రామ ఇలవేల్పు భూలక్ష్మీ దేవి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మూడో రోజు శుక్రవారం ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు, గ్రామ సేవ, ప్రత్యేక అలంకరణతో మహిళలు పూజలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి రాంబాబు, ఉప సర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, కొప్పుల చౌదరారెడ్డి, పరెడ్డి శ్రీనివాసరెడ్డి, శిలపరెడ్డి వెంకటరెడ్డి, పైడిమర్ల జగన్‌మోహన్‌రెడ్డి, కొమ్మసాని వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

50 ఏళ్లకే బీసీలకు పెన్షన్ : నాగరాజు



లింగపాలెంలో కరపత్రాలతో బీసీ నేతలు

చింతలపూడి, మార్చి 15: రానున్న ఎన్నికల సందర్భంగా బీసీ డిక్లరేష న్‌లో జనసేన బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తోందని నాయీ బ్రాహ్మణ సంఘ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు అన్నారు. శుక్రవారం రామవాపురం గ్రామంలో ఇంటింటా బీసీ డిక్లరేషన్‌లో బీసీల కు అందిస్తున్న సంక్షేమాలను ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, సంగీత పాఠశాలకు 200 యూనిట్లు కరెంటు ఇస్తారని వివరించారు. సాధికార కమిటీసభ్యులు డీవీ గంగాధర్, నందిగం సుబ్బారావు, సత్యనారాయణ, పరిమి నాగేశ్వరరావు, సత్యం, శేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు వెన్నెముక టీడీపీనే..

లింగపాలెం, మార్చి 15:బీసీలకు వెన్నెముక టీడీపీయేనని ఏలూరుజిల్లా సాధికార కమిటీ అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు అన్నారు. శుక్రవారం లింగపాలెం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక బీసీలకు సంక్షే మ పథకాలను ఎత్తివేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో చింతలపూడి నియోజక వర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషణ్‌కుమార్‌ను గెలిపిం చుకోవాలని అన్నారు. ఏలూరు జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పాక వెంకటేశ్వరరావు, వీరవెంకటసత్యనారాయణ, ద్రాక్షా వరపు వెంకట గంగాధరరావు, నందిగం సుబ్బారావు పాల్గొన్నారు.

టీడీపీతో సుపరిపాలన అందిస్తాం : మద్దిపాటి

ద్వారకాతిరుమల, మార్చి15 : టీడీపీ అధికారంలోకి రాగానే గోపాలపురం నియోజవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు తీయించడంతో పాటు సుపరిపాలనను అందిస్తామని గోపాలపురం నియోజవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అభ్యర్థిగా నియమితులైన సందర్భం గా ఆయన భారీ ర్యాలీగా భీమడోలు మండలం పొలసానిపల్లి ఫ్లైఓవర్ వద్దనుంచి బయలుదేరి ద్వారకాతిరుమలకు చేరుకున్నారు. క్షేత్రానికి వచ్చిన ఆయన ముందుగా పాదుకా మండపం వద్ద ప్రత్యేక పూజలు జరుపుకు న్నారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తనను అభ్యర్థిగా ఎంపిక చేసిన చంద్రబాబు, లోకేష్‌లకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నేతలు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి, పోలిన శ్రీనివాసరావు, డీవీఎస్ చౌదరి, నాదెళ్ల వేణు, మటపర్తి బద్రి పాల్గొన్నారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన పెరగాలి



వినియోగదారులను సత్కరిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు ఎడ్యుకేషన్/జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 15:వినియోగదారుల హక్కులను రక్షించేందుకు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత నేటి యువతరంపై ఉందని జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఆర్.ఎస్.ఎస్ రాజు ఆధ్వర్యంలో ఏలూరు సీఆర్‌రెడ్డి డిగ్రీకళాశాల ఆడియో విజువల్ హాల్లో కార్యక్రమం నిర్వహించారు. కన్జూమర్ జిల్లా అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామానుజాచార్యులు మాట్లాడారు. అనంతరం పలువుర్ని సన్మానించారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుని హక్కులపై ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిబాబు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాసపోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. జంగారెడ్డిగూడెంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకురాలు సీహెచ్ రమాదేవి, హనుమంతరావు మాట్లాడారు.

మద్ది హుండీ ఆదాయం రూ.37.27 లక్షలు

జంగారెడ్డిగూడెం, మార్చి 15 :మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమంలో భాగంగా ఆదాయం రూ.37,27,275 వచ్చిం దని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ. సుజన్‌కుమార్ పర్యవేక్షణలో కే.వీ.బీ.బ్యాంక్ సిబ్బంది సమక్షంలో 72 రోజు లకు గాను హుండీలెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా రూ.34,13,729, చిల్లర నాణెల రూపంలో రూ.1,59,252, అన్నదానం హుండీ రూ.1,52,530, నోట్ల రూపంలో ఆదాయం రూ.1,764 సమకూరిందన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కీసరి సరిత విజయ భాస్కరరెడ్డి, ధర్మకర్తలు దండు వెంకట కృష్ణంరాజు, జెట్టి దుర్గమ్మ, కర్పూరం రవి పాల్గొన్నారు.

విశ్వనాథ ఆశ్రమానికి రూ.1.25 కోట్లు మంజూరు

చింతలపూడి, మార్చి 15: చింతలపూడి విశ్వనాథమఠం ఆశ్రమం శిథిలావస్థకు రావడంతో దేవదాయధర్మదాయశాఖ సీజీఎఫ్ నిధుల కింద కోటి 25లక్షల రూపాయలు మంజూరయ్యాయని ఆలయ ఈవో సాంబశివ రావు తెలిపారు. శుక్రవారం ఈ పనులకు శంకుస్థాపన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆశ్రమంలో ప్రతి శుక్రవారం పండుగ దినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తులు కొలువై ఉన్నారని, దాతల సహకారంతో పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రధానార్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

చింతలపూడి, మార్చి 15:చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పాల్‌సతీష్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ జరిపారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సక్రమంగా హాజరుకావడం లేదని వచ్చిన ఆరోపణపై తనిఖీ జరిపారు. ఆయన మాట్లాడుతూ ఆసుప త్రిపై ఫిర్యాదులు వచ్చాయని, సిబ్బంది, డాక్టర్లు గైర్హాజరయితే నోటీసులు ఇస్తామన్నారు. ఆసుపత్రికి మరో ఇద్దరు మహిళా గైనకాలజిస్టులను, ఒక జన రల్ మెడిసిన్ స్పెషలిస్టును, పిల్లల వైద్యుల నిపుణులను త్వరలోనే జాయిన్ అవుతారన్నారు. వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం ముగింపు దశలో ఉందని, అది పూర్తయితే పూర్తిస్థాయి ఎక్విప్‌మెంట్, సిబ్బంది వస్తారన్నారు.

చైతన్య విద్యార్థులకు బహుమతులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 15:ఏలూరు బాలాజీనగర్‌లోని చైతన్య పాఠశాలలో ఇన్స్పో (ఐఎస్‌టీఎస్‌వో) సెకండ్ లెవెల్ పరీక్షలో ప్రతిభకనబరిచిన విద్యార్థులు ఎం.భాను, లోహితకు స్కూలు యాజమాన్యం శుక్రవారం నిర్వ హించిన ఓ కార్యక్రమంలో ల్యాప్‌టాప్, ట్యాబ్‌లను బహూకరించింది. వీరితో పాటు మరికొందరికి ప్రత్యేక బహుమతులు, పతకాలను, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపాల్ సత్యనారాయణ అందజేశారు. స్కూలు ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ ఉదయభాస్కర్, ప్రైమరీ జోనల్ కో-ఆర్డినేటర్ కవిత రాజేశ్వరి, డీన్ సుధాకర్, హైస్కూల్ ఇన్స్పో ఇంచార్జి రత్నశ్రీ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

పెదపాడు, మార్చి 15:యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూని యన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సత్రంపాడులో గ్రామీణ యువతులకు ఉచితంగా బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. 19-45 ఏళ్ల వయస్సు గల గ్రామీణ ప్రాంత మహిళలకు ఏప్రిల్ 2వ తేదీ నుంచి వసతి, భోజనంతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తిగల వారు 95027 23561, 99485 65256 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వెల్త్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన

పెదపాడు, మార్చి 15: వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశా లలో ఏంబీఏ విద్యార్థులకు వెల్త్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బజాజ్ క్యాపిటల్‌కు చెందిన ఆర్థిక నిపుణులు నితిన్‌కపూర్ పెట్టుబడి, పొదుపు వంటి అంశాలపై విద్యార్థులకు వివరిం చారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఏంబీఏ హెచ్‌వోడీ డాక్టరు కొడాలి శ్రీధర్, కో-ఆర్డినేటర్లు నిమ్మల సతీష్, ఈడ్పుగంటి కవిత పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ

ఏలూరు క్రైం, మార్చి 15 : ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ తీగను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. నగర శివారు దుగ్గిరాల సమీపంలోని పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి అం దులోని కాపర్‌వైర్‌ను దొంగలు అపహరించుకుపోయారు. సంబంధిత విద్యుత్ అధికారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



భీమవరంలో మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు నవజ్యోతి, విజయ నిర్మల ..

పకడ్బందీగా గ్రూప్ -1 పరీక్షలు

రేపు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహణ

ఉమ్మడి జిల్లాలో 12 కేంద్రాలు.. 8,581 మంది అభ్యర్థులు

ఏలూరు కలెక్టరేట్, మార్చి 15 : ఉమ్మడి జిల్లాలో ఈ నెల 17న నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏలూరు జిల్లాలో ఐదు కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షకు 4,372 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని గ్రూప్-1 జిల్లా సమన్వయ అధికారి, జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలలో 4,209 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు పి.నవజ్యోతి, బి.విజయ నిర్మల తెలిపారు. పరీక్షకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్, లైజన్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 'పరీక్షల నిర్వహ ణకు ఐదు సెంటర్లు ఏర్పాటు చేశాం. వీటికి ఐదుగురు లైజన్ ఆఫీసర్లను నియమించాం. సీఆర్ రెడ్డి కళాశాలకు పశు సంవర్ధకశాఖ జేడీ జి.నెహ్రూ బాబు, సీఆర్ రెడ్డి బాలికల డిగ్రీ కళాశాలకు సెట్‌వెల్ సీఈవో మెహ్రాజ్, సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలకు ఏపీజీఎల్ఐ డీడీ కె.శ్రీనివాస వరప్రసాద్,సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలకు మత్స్యశాఖ అధికారి వి.నాగలింగేశ్వర్‌ను నియమించాం. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయి. గంట ముందే అంటే 9 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. సమయం దాటిన తర్వాత పరీక్షకు అను మతించం. కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్య లేకుండా చూడాలి. పరీక్ష రాసేందుకు వీలుగా ఆర్టీసీ సర్వీసులు నడపాలి' అని సూచించారు. ఆర్డీవో ఖాజావలీ, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి జి.అశోక్, ఎం.విజయ్‌కుమార్, పరీక్ష సూపరిం టెండెంట్‌లు, అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమవరం ఎడ్యుకేషన్ : కలెక్టరేట్‌లో పరీక్షా కేంద్రాల లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, సంబంధిత అధికారులతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరీక్షల కోసం ఏడుగురు రూటు ఆఫీసర్లు, ఏడుగురు లైజనింగ్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి జి.గణపతిరావు, జిల్లా నీటిపారుదల అధికారి కె.గంగాధరరావు, హౌసింగ్ ఈఈ వెంకటరమణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఫిషరీస్ అధికారి ప్రసాద్, జిల్లా పబ్లిక్ అధికారి విజయ, కలెక్టరేట్ సూపరిండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రభాకర్ బాబు

పది పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

కలిదిండి, మార్చి 15 : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. శుక్రవారం కలిదిండి శశి హైస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలను అరికట్టేందుకు ఈసారి ప్రశ్నపత్రాలపై క్యూఆర్ కోడ్ ముద్రిస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించారని, అధికారులు సైతం ఫోన్లు తీసుకు రాకూడదని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 715 మంది రెగ్యులర్ విద్యార్థులు, 308 మంది ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 1023 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

ఉపాధి కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ



ముసునూరు, మార్చి 15: ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఏపీవో రోజ్‌లీల అన్నారు. శుక్రవారం మండలంలోని గోపవరం, ముసునూరు, చింతలవల్లి తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను ఏపీవో అందజేసి మాట్లాడుతూ పనులు వద్ద కూలీలకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు టెంట్లు, తాగునీరు సౌకర్యా లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులు చేసేటప్పుడు ప్రమాదవశాత్తు గాయ పడితే ప్రథమ చికిత్స చేసుకునేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను ప్రతి గ్రూప్‌కు ఇస్తామన్నారు. ఈసీ జయప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, టీఏలు పాల్గొన్నారు.

'బీవీ రావు ప్రచారం హాస్యాస్పదం'



మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

కైకలూరు, మార్చి 15: తనకే టిక్కెట్టు వచ్చినట్లు జనసేన నాయకుడు బీవీ రావు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం కైకలూరు జనసేన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019లో జనసేన తరపున పోటీ చేసిన బీవీ రావు ఎన్నికల్లో ఓటమి తరువాత నాలుగున్నరేళ్ళ వరకు ప్రజలకు కనపడలేదన్నారు. పొత్తుల్లో భాగంగా బీజేపీకి టిక్కెట్టు కేటాయిస్తున్నారని తెలిసినా తనకే టిక్కెట్టు వచ్చిందని తన వ్యక్తిగత సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారని దీనివల్ల జనసేన కార్యకర్తలు, అభిమానులు అయోమయానికి గురవుతున్నారన్నారు. జనసేన నాయకులు ఎం. నాగమల్లేశరరావు, పుప్పాల సూర్యప్రకాశరావు, తిరుమాని ఏసుబాబు, మహిళా నాయకురాలు శొంఠి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన బాలికలు తల్లిదండ్రుల చెంతకు..

ఆగిరిపల్లి, మార్చి 15: ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినుల ఆచూకీ లభ్యమైంది. నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య ఆదేశాల మేరకు ఆగిరిపల్లి ఎస్సై పి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేయగా సైబర్ టీం మిస్టరీ ఛేదించింది. ఒక విద్యార్థిని ఇంట్లో గొడవపడి తన ఇద్దరు స్నేహితులను తీసుకుని నంద్యాల వెళ్ళినట్లు తెలిసింది. పోలీస్‌లు నంద్యాలవెళ్ళి వారిని తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన వ్యక్తి వీరిని నంద్యాల రమ్మని పోస్ట్ చేయడంతో వీరు నంద్యాల వెళ్ళినట్లు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

ముసునూరు, మార్చి 15: మండలంలోని రమణక్కపేట, ముసునూరు గ్రామాల్లో శుక్రవారం పేకాట శిబిరాలపై ఎస్‌ఐ పి.వాసు తన సిబ్బందితో కలసి దాడులు చేశారు. రమణక్కపేటకు చెందిన నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1130లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముసునూరులో ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1020లు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.



రెయిలింగ్ విరిగి ప్రమాదకరంగా పెదలంక వంతెన

ఏడేళ్లుగా ఇంతే..

పెదలంక డ్రైన్‌పై విరిగిన రెయిలింగ్

హడలిపోతున్న వాహన చోదకులు

వంతెనపై నుంచి డ్రైన్‌లో పడిపోతున్న పశువులు

పట్టించుకోని అధికారులు

ముదినేపల్లి, మార్చి 15 : ముదినేపల్లి - బంటుమిల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఉప్పరగూడెం గ్రామ సమీపంలోని పెదలంక మేజర్ డ్రైన్‌పై వంతెన ప్రమాదకరంగా మారింది. ఏడేళ్ల క్రితం లారీ ఢీకొని ఈ వంతెనపై ఒక పక్క రెయిలింగ్ విరిగిపోయింది. దీంతో వంతెనపై వాహన రాకపోకలకు రక్షణ కరువైంది. పెద్ద వాహనాలు, ఆర్టీసీ బస్సులు వచ్చే సమయంలో ఎదురుగా సైకిల్‌ను తప్పించేందుకు కూడా భయపడుతున్నారు. అసలే ఇరుకు వంతెన, పైగా రెయిలింగ్స్ విరిగిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా విరిగిపోయిన రెయిలింగ్స్‌ను చూసి వెళ్లారే తప్ప ఏళ్ల తరబడి వాటిని పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవటం లేదు. ఇటీవల వంతెనపై వస్తున్న వాహనానికి ఎదురుగా వెళ్లిన పశువులు రైలింగ్స్ కూలిపోయిన చోటు నుంచి డ్రైన్‌లో పడిపోయాయి. ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ వంతెనపై రెయిలింగ్స్ ఏర్పాటు చేయటంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిధుల కొరత కారణమంటున్నారు. ఈ డ్రైన్‌పై రూ.3 కోట్ల వ్యయంతో కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, అప్పటి వరకు ప్రస్తుత వంతెన పరిస్థితి ఇంతేనంటున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



పెదలంక మేజర్ డ్రైన్ వంతెనపై వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. రెయిలింగ్స్ విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. తాత్కాలికంగా ఐరన్ రాడ్లు బిగించారు.

-నవుడు సాంబశివరావు, ఉప్పరగూడెం



అవగాహన కల్పిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత



సమావేశానికి హాజరైన నాయకులు, అధికారులు

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే

ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత

కైకలూరు, మార్చి 15: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా అనుసరించాలని ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత అన్నారు. శుక్రవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులకు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, నామినేషన్ విధి విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి ఫోటోతో ప్రచురిస్తారని మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు త్వరితగతిన పోలింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఓటరుకు నియోజకవర్గంలో ఎక్కడ ఓటు హక్కు ఉన్నా ఏ బూత్ ఏజెంట్‌గానైనా ఉండొచ్చన్నారు. ఎన్నికల ప్రచారాల్లో ఎన్నికల నియమావళికి అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఒక్కో అభ్యర్థి ముగ్గురు ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే సభల వివరాలను ఎన్నికల అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఒక వ్యక్తి రూ. 50 వేలు కన్నా ఎక్కువ నగదు తీసుకువెళ్లకూడదన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ భవనాలపై ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఫోటోలను తీసివేయడంతో పాటు గ్రామాల్లో ఉన్న వివిధ పార్టీల ఫ్లెక్సీలను తొలగించి నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తామన్నారు. ఎన్నికల ప్రచారాల్లో పంపిణీ చేసే కరపత్రాలపై ముద్రించిన వారి పూర్తి వివరాలుండాలన్నారు. మైక్ ద్వారా ప్రచారం చేసేవారు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే నిర్వహించాలని తరువాత కూడా ప్రచారం చేస్తే నిబంధనలు ఉల్లంఘించినట్లేనన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, వారిని ఏ పార్టీ నాయకుడైనా ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అభ్యర్థులు తమ ప్రచారాల్లో వ్యక్తిగతంగాను, కులమతాలను ప్రస్తావించకూడదని, అలాంటి వాటిపై ఎన్నికల అధికారుల నిఘా ఉంటుందన్నారు. ఎక్కడైనా ప్రలోభాలకు గురిచేసినా స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తారని హెచ్చరించారు. ఆర్వో కె. భాస్కర్, తహసీల్దార్ ఎస్. పోతురాజు, టీడీపీ, బీజేపీ, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథితో గ్రామస్థులు

ఈదరలో పార్థసారథి ఆత్మీయ సమావేశం

ఆగిరిపల్లి, మార్చి 15: కొత్త ఈదరలో ఎమ్మెల్యే పార్థసారథి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత యాదవ సామాజిక వర్గం నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నప్పటికీ సమావేశం ముగిసే సమయానికి వారిని కూడా సమాధాన పరిచారు. ముద్దరబోయినతో కలసి వస్తేనే మీతో మాట్లాడతామని యాదవ సామాజికవర్గం భీష్మించగా పార్టీలో జరిగిన మార్పు లు, ముద్దరబోయినకు అధినేత చంద్రబాబు సీటు ఎందుకు ఇవ్వలేదో పార్థసారథి వివరించగా వారు శాంతపడి పార్టీతోనే పనిచేయటానికి సంసిద్ధత వ్యక్తం చేశారు.

కార్యకర్తలే బలం : ముద్దరబోయిన

నూజివీడు టౌన్, మార్చి 15: కార్యకర్తలే తనకు బలమని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. దేవరగుంటలో గ్రామస్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రెండు పర్యాయాలు నాయ కులను నమ్మి ఓటమి పాలయ్యారని, ఈ పర్యాయం కార్యకర్తలు తనను ముందుకు నడిపిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది నూజివీడును అభివృద్ధిని చేసి చూపుతానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన, టీడీపీ నాయకులు

చిలకలూరిపేట సభ విజయవంతం చేయాలి

నూజివీడు టౌన్, మార్చి 15: చిలకలూరిపేట సభను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు కోరారు. నూజివీడు నియోజకవర్గ జనసేన కార్యాలయంలో టీడీపీ నూజివీడు అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు పార్టీలు కలసి తొలిసారిగా ఈ నెల 17న చిలకలూరిపేటలో అతిపెద్ద ఉమ్మడి భారీ బహిరంగ సభ నిర్వహించటం జరుగుతోందని, ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటున్నారన్నారు. ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడే దిశగా నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలన్నారు. మల్లిశెట్టి జగదీష్ మాట్లాడుతూ నూజివీడు నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశామని, టీడీపీ, జనసేన కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు దద్దనాల రవికిషోర్, జనసేన, టీడీపీ నాయకులు జి.ఉమామహేశ్వరరావు, జక్కుల లక్ష్మి, రామిశెట్టి తేజశ్విని, సూరిశెట్టి శివ, మండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.





గ్రామస్థుల ధర్నా.. పైప్‌లైన్ పగిలి డ్రైన్‌లోకి చేరిన నీటిని ఇంజన్‌తో తోడిస్తున్న దృశ్యం

పైప్‌లైన్ పగలగొట్టేశారు

వృథాగా పోయిన తాగునీరు **రెండ్రోజులుగా కుళాయి బంద్**

హైవే అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ ఆధ్వర్యంలో ధర్నా

ముదినేపల్లి, మార్చి 15 : నంబరు 165 పామర్రు - కత్తిపూడి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి పంచాయతీ ఏరియాలో డ్రైనేజీ పనుల నిర్వహణలో పంచాయతీ మంచినీటి పైపులైన్లను తొలగించటంపై శుక్రవారం గ్రామస్థులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు భగ్గుమన్నారు. రహదారి పనుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ కోటయ్య, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు తదితరుల ఆధ్వర్యంలో గ్రామస్థులు పైపులు తొలగించిన పోలీస్ స్టేషన్ సమీపాన ధర్నా నిర్వహించారు. డ్రైన్ల నిర్మాణానికి రోడ్డు పక్కన ఉన్న మంచినీటి పైపులను పగులగొట్టడం వల్ల ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి వచ్చే నీరు రోడ్లపైకి పొంగి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేదన్నారు. దీనిపై ఎన్‌హెచ్ అధికారులతో సర్పంచ్ ఫోన్‌లో మాట్లాడి పైపులు పగిలిపోవటం వల్ల నెలకొన్న ఇబ్బందిని వివరించారు. గురువారం నుంచి గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయిందని అధికారులకు తెలపగా, తాము చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పడిన ముంపు నీటిని ఇంజన్లతో తోడించి ట్యాంకర్ల ద్వారా బయటికి తరలిస్తున్నారు.

5వ రోజుకు...

పెద్దింటి అమ్మవారి జాతర



కైకలూరు, మార్చి 15: కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాలు ఐదో రోజుకు చేరాయి. శుక్రవారం అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. అమ్మవారికి చతుర్ధావరణపూజ, కలశార్చన, అష్టోత్తర నామార్చన, పుష్పాలంకరణ, ధూపసేవ బాలభోగం, పంచ హారతులు ఘనంగా నిర్వ హించారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, భక్తులకు ప్రసాదాన్ని ఆటపాక గ్రామానికి చెందిన వేగేశ్న ప్రసాదరాజు దంపతులు, గణపవరానికి చెందిన రుద్రరాజు పుల్లంరాజు దంపతులు అందజేశారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు. సాయంత్రం తామరకొల్లు గ్రామానికి చెందిన మీగడ సత్యనారాయణ శిష్య బృందంచే కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

వైభవంగా కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం

ఆధ్యాత్మికం

గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవాలకు హాజరైన భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం



కలిదిండి, మార్చి 15 : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, ఆసాదుల గరగ నృత్యాలతో జాతర నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బాజా భజంత్రీలతో, బాణసంచా కాల్పులతో ఘనంగా ఊరేగించారు. మహిళలు కొబ్బరికాయ, పసుపు, కుంకుమలు సమర్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఎస్ఐ ప్రియకుమార్ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీపీ ఉమామహేశ్వరరావు, మూల్లంక సర్పంచ్ మహాదేవ్ విజయ్, మాజీ ఎంపీపీ బండి లక్ష్మి, ఆలయ ఛైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీ వద్ద రిలే దీక్షల్లో కాలనీ వాసులు

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

పెయ్యేరులో 3వ రోజుకు దీక్షలు

ముదినేపల్లి, మార్చి 15 : తమ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ముదినేపల్లి మండలం పెయ్యేరు పంచాయతీ ఏరియాలోని వైఎస్ఆర్ కాలనీ వాసులు చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజుకి చేరాయి. బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర, పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్డి నాగలక్ష్మి, బొర్రా శ్రీను, డి. కిరణ్, టేకు కనకాచారితోపాటు పలువురు మహిళలు దీక్షల్లో పాల్గొన్నారు. కాలనీ నుంచి మురుగు నీరు పోయే మార్గాన్ని చూపించటంలో ఏళ్ల తరబడి అధికారులు విఫలమవుతున్నారని దీక్షల్లో పాల్గొన్న వారు విమర్శించారు. కాగా కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఇంకుడు గుంత తవ్వకానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగించేందుకు అనుమతి కోసం తహసీల్దార్‌కు లేఖ రాశామని ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



ముదినేపల్లి, మార్చి 15 : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగియగా, ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ముగిశాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో చివరి రోజున ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 206 మంది హాజరు కావాల్సి ఉండగా, 12 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారిగా కేవీవీ నాగేశ్వరరావు వ్యవహరించగా, ఎస్ఐ డి.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు స్థానిక వీఆర్, వికాస్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



ఆగిరిపల్లి, మార్చి 15: తోటపల్లిలోని ప్రి హైస్కూల్‌లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్వచ్ఛత 2023-24 అంశంపై పిల్లలకు పరిసరాల పరిశుభ్రత, వాతావరణ కాలుష్యం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజరు కె.నాగమనోహర్, డిప్యూటీ మేనేజరు ఎం.శివనాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శోభన్‌బాబు, ఉపాధ్యాయ బృందం విజేతలకు బహుమతులు అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు ఎన్నారై వితరణ



చాట్రాయి, మార్చి 15: చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో 30 మంది టెన్త్ విద్యార్థులకు, పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్నారై కొండపల్లి రఘునాథరెడ్డి దంపతులు శుక్రవారం ప్యాడ్లు, కంపాస్ బాక్స్‌లు అందజేశారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత చదువులు చదివి ఇష్టమైన రంగంలో రాణించాలని దాతలు ఉద్బోధించారు. హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, చంటిబాబు, వెంకటేష్, మోహనరావు పాల్గొన్నారు.

చనుబండలో సురక్ష వైద్యశిబిరం



చాట్రాయి, మార్చి 15: చనుబండ-1 సచివాలయంలో శుక్రవారం సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు జాషువా, సోనీ బేబీ, పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్, శ్రీనివాసులురెడ్డి 245 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, స్థానిక నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనసానపల్లిలో..

ఆగిరిపల్లి: కనసానపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జగన్మోహన్‌రావు, ఆగిరిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ టీనా నూజివీడు నుంచి ఆప్తాలమిస్ట్ డాక్టర్ మాధురి 422 మందికి వైద్యసేవలందించినట్టు డాక్టర్ టీనా తెలిపారు.

నూజివీడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నూజివీడు టౌన్, మార్చి 15: నూజివీడు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శంకుస్థాపన చేశారు. నూజివీడులో గడప గడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యలు పరిష్కా రానికి సంబంధించి 16 సచివాలయాలకు ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేయగా, పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం



కలిదిండి, మార్చి 15 : గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరందించటమే లక్ష్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గుర్వాయిపాలెంలో రూ.9 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్ పైపులైన్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.1.3 కోట్లతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ప్రారం భించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కనక దుర్గారాణి, నాగలక్ష్మి, సర్పంచ్ బత్తిన ఉమా మహేశ్వరరావు, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, పోసిన చెంచు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు ప్రారంభం

ముదినేపల్లి, మార్చి 15 : ముదినేపల్లి పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారులను శుక్రవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, కాలనీ రోడ్లను ప్రారంభించారు. నాయకులు మోట్రు ఏసుబాబు, నిమ్మగడ్డ భిక్షాలు, కొల్లి నాని తదితరులు పాల్గొన్నారు.